క్లుప్తంగా

జగనన్న సురక్ష సర్వే



కరపత్రం అందజేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక 62వ వార్డు సచివాలయం పరిధిలో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి వారి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. జగనన్న సురక్ష కరపత్రాలను అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం కన్వీనర్లు వితల చంద్ర శేఖర్, కె.జయలక్ష్మి, ఇరదల వినీత్, డివిజన్ అధ్యక్షుడు నందూరి వేణుగోపాల్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ వెంకట కృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగర ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ వెంకట కృష్ణ పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఈదర సుబ్బమ్మదేవి హైస్కూల్‌లో ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను శుభ్రపరచడంతో పాటు విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, పర్యావరణ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఆర్ఆర్‌లో 'స్వచ్ఛత'

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొని పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. కరస్పాండెంట్ వంకినేని రవికుమార్, ప్రిన్సిపాల్ పి.సాయికుమారి శంకర్, డైరెక్టర్ కె.రాజకళా శ్రీధరి పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎన్ఎస్ఆర్‌కే విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన అథ్లెట్లు

ఏలూరు రూరల్: అక్టోబర్ 15 నుంచి 17 వరకు వరంగల్‌లో నిర్వహించే జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు స్థానిక నంది శివరామకృష్ణ కళాశాల విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారని కరస్పాండెంట్ డి.రవికుమార్ తెలిపారు. ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన 36వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. మూడు గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ మెడల్స్ వచ్చాయన్నారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతోన్న కేఎస్ఎస్ సహిల్‌బాబు రెండు బంగారు పతకాలు సాధించిన ఉత్తమ అథ్లెట్‌గా అవార్డు అందుకున్నాడని వివరించారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటుతున్నారని వెల్లడించారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్: ఏలూరు మండల, నగర పరిధిలో తొమ్మిది వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి తెలిపారు. చాటపర్రు-2, సత్రంపాడు, శ్రీపర్రు, మొండికోడులో ఒక్కొక్కటి చొప్పున, వెంకటాపురంలో నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అక్టోబర్ 3న దరఖాస్తుల పరిశీలన, 4న మౌఖిక పరీక్ష, 5న ఎంపికైన వలంటీర్ల వివరాలు వెల్లస్తామరు.

ఎలుకల నివారణతో దిగుబడి పెంచుకోవచ్చు



ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: సామూహిక ఎలుకల నివారణతో రైతులు దిగుబడి పెంచుకోవచ్చని జిల్లా వ్యవసాయశాఖ ఉప సంచాలకులు వై.సుబ్బారావు అన్నారు. బుధవారం మల్కాపురంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టారు. ఎలుకల వల్ల రైతులు పంట నష్టపోతున్నారని, దిగుబడి సైతం తగ్గిపోతుందని సుబ్బారావు వివరించారు. అనంతరం రైతులు, ఆర్బీకే సిబ్బంది కలిసి నూకలతో మందు తయారుచేసి రైతులకు అందజేశారు. విత్తన అభివృద్ధి సంస్థ, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నృత్యరీతుల్లో కూచిపూడికి ప్రత్యేక స్థానం



ఆంధ్రనాట్యం ద్వారా తన హావ భావాలతో అలరించిన కళాకృష్ణ



పేరిణి నృత్యంతో అబ్బుర పరిచిన కళాకారులు



కళాకారిణిల కూచిపూడి నృత్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారతీయ సంప్రదాయ నృత్య రీతుల్లో కూచిపూడి నృత్యానికి ప్రత్యేక స్థానం ఉందని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు పి.వి జయబాబు అన్నారు. నగరానికి చెందిన హిందూ యువజన సంఘం, ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం సౌజన్యంతో భరతకళా ప్రపూర్ణ, పద్మశ్రీ నటరాజ రామకృష్ణ శతజయంతి మహోత్సవాల సందర్భంగా స్థానిక వైఎంహెచ్ఏ హాలులో బుధవారం నృత్యాంజలి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయబాబు మాట్లాడుతూ సంప్రదాయ, ప్రాచీన కళలకు ప్రోత్సాహం, సహకారం తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజ అభిరుచులు మారిపోతున్న ప్రస్తుత పరిస్థితులలో సాంస్కృతిక కార్యక్రమాలకు సహకరించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఆధునికత నేపథ్యంగా ఉన్నప్పటికీ మన సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టటానికి కృషి చేయాలని కోరారు. తొలుత నటరాజ రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిప్రకాశనంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన నటరాజ రామకృష్ణ శిష్య, ప్రశిష్యులచే సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణ నిర్వహణలో నృత్యాంజలి కార్యక్రమంలో భాగంగా ఆంధ్ర నాట్యం, పేరిణి తాండవ నృత్య ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. కళాకృష్ణ, ఆంధ్ర నాట్య ప్రదర్శనలో నాట్య హావాభావాలు ప్రేక్షకులని తన్మయత్వానికి గురిచేశాయి. కార్యక్రమంలో హిందూ యువజన సంఘం మేనేజ్ మెంట్ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఇరదల ముద్దుకృష్ణ, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, సహాయ కార్యదర్శులు వేమా కోటేశ్వరరావు, కార్యనిర్వాక కమిటి ఉపాధ్యక్షుడు బీవీ సుబ్రహ్మణేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, సహాయ కార్యదర్శి ఎల్ వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రాయ్, భగత్‌సింగ్‌లు ఆదర్శప్రాయులు



సెంట్ థెరిస్సా హైస్కూల్లో మాట్లాడుతున్న గుడిపాటి నరసింహారావు



కార్యక్రమంలో పాల్గొన్న మానవత అధ్యక్షుడు అజయ్‌బాబు

ఏలూరు (టూటౌన్): సంఘ సంస్కర్త రాజారామ్మోహన్‌రాయ్, విప్లవ వీరుడు భగత్‌సింగ్ అందరికీ ఆదర్శప్రాయులని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మానవత ఏలూరు అధ్యక్షుడు మేతర అజయ్‌బాబు అన్నారు. రాజారామ్మోహన్‌రాయ్ 190వ వర్ధంతి, భగత్‌సింగ్ 116 జయంతిని పురస్కరించుకుని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఇచ్చిన పిలుపు మేరకు నగరంలోని 30 హైస్కూల్స్, 10 కాలేజీల్లో బుధవారం సభలు, కార్యక్రమాలు నిర్వహించారు. సురేష్ చంద్ర బహుగుణ పోలీసు స్కూల్, సెంట్ థెరిస్సా హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో గుడిపాటి నరసింహారావు, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, సిద్ధార్థ విద్యాలయంలో నిర్వహించిన సభల్లో మేతర అజయ్‌బాబు మాట్లాడారు. బాలిక విద్య కోసం రాజారామ్మోహన్‌రాయ్ దేశంలో మొదటి బాలికల స్కూల్‌ని ప్రారంభించారని వివరించారు. ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి, బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఒప్పించి సతీ సహగమన నిషేధ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. భగత్ సింగ్ చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వ్యతిరేక పోరాటంలో యువతరాన్ని ముందుండి నడిపించారని కొనియాడారు. కార్యక్రమాల్లో జి.శారద, ఎస్.గంగాభవాని, వై.అర్జున్‌రావు, వి.సురేష్, పి.దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేపీడీసీ స్కూల్లో..

సంఘ సంస్కర్త రాజారామ్మోహన్‌రాయ్, విప్లవ వీరుడు భగత్‌సింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్ర కమిటీ సభ్యుడు పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధనకు పనిచేయడమే వారికిచ్చే నిజమైన నివాళి అన్నారు. వారి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రేమ్ చంద్, స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పీవీఆర్‌కే ప్రసాద్, నాగ మునేశ్వరరావు, ఎస్ రామయ్య, ఎం సూర్యనారాయణ, ఐ.రమేష్, ఒ.బోగలింగేశ్వరరావు, బి.కమలమ్మ, కె.పద్మావతి, శశికళ, ఎస్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల కోరుతూ వినతి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పాఠశాలల ఖర్చుల గ్రాంట్లు, ఎంఈఓ-2ల జీతాలు చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు బుధవారం డీఈఓ పి.శ్యామ్ సుందర్‌కు వినతిపత్రం అందజేశారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి కొన్ని పాఠశాలలకు 20 శాతం, మరికొన్ని పాఠశాలలకు 40 శాతం గ్రాంట్లను జమ చేశారని, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు పాఠశాల నిధులు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. గత జూన్ వరకు విద్యుత్ బిల్లులు, ఇప్పటి వరకు స్టేషనరీ, పరీక్ష పేపర్ల జిరాక్స్, ఇతర ఖర్చులకు ప్రధానోపాధ్యాయులు తమ చేతి సొమ్ము వెచ్చించారని తెలిపారు. రెండేళ్లుగా మార్చి నెలాఖరు నాటికి నిధులు జమ చేయడం, ప్రధానోపాధ్యాయులు తీసుకోలేని పరిస్థితుల్లో నిధులు వెనక్కి వెళ్లిపోవడం జరుగుతోందని వివరించారు. గత జూన్ 18న కౌన్సిలింగ్ ద్వారా ప్రధానోపాధ్యాయులను బదిలీలపై ఎంఈఓ-2గా నియమించారని, వారికి నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడంలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి జి.ప్రకాశరావు, ఉపాధ్యక్షులు జె.రవీంద్ర వి.మురళీకృష్ణ ఉన్నారు.

అన్నసమారాధన సంప్రదాయం అభినందనీయం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పూర్వీకుల నుంచి ప్రారంభమైన అన్నసమారాధన సంప్రదాయాన్ని నేటికీ కొనసాగించడం అభినందనీయమని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ప్రశంసించారు. స్థానిక అమీనాపేటలోని పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద అభయాంజనేయ స్వామి ఆలయం పక్కన ఉన్న సిద్ధి వినాయక స్వామి ఆలయంలో గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆకలి అన్ని వర్ణాలు, మతాలు, వర్గాల వారికీ ఒకటేనని గ్రహించి మన పూర్వీకులు పండుగలు, పర్వదినాలు, ప్రత్యేక దినాల్లో అన్నసమారాధన సంప్రదాయాన్ని ప్రారంభించారని ఎస్పీ గుర్తుచేశారు. మనిషి ఆకలిని తీర్చడం దైవ కార్యంగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ శేఖర్, డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, ఏలూరు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఏఆర్ ఆర్ఐ ఐ.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ ప్రసాద్‌కి నివాళి

ఏలూరు(మెట్రో): ఉద్యోగుల సేవకే జీవితాన్ని అంకితం చేసి, ఉద్యమంలోనే తోట సుధాకర్ ప్రసాద్ అర్థాంతరంగా అశువులుబాసారని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఏలూరు రెవెన్యూ భవనంలో సుధాకర్‌ప్రసాద్ 22వ వర్ధంతి కార్యక్రమం ఏలూరు జిల్లా అధ్యక్షుడు, జిల్లా జేఏసీ చైర్మన్ కె.రమేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఉద్యోగులు సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి స్టేట్ జనరల్ సెక్రటరీ పి.దామోదర్, జిల్లా జనరల్ సెక్రటరీ రాంబాబు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.ప్రమోద్‌కుమార్, జిల్లా కార్యవర్గసభ్యులు, ఏపీజేఏసీ వర్మ, వీరబాబు, సుందరి డ్రైవర్స్ అసోసియేషన్ వేణు, గ్రామవార్డు సచివాలయ రాష్ట్ర నాయకలు జ్యోతి పాల్గొన్నారు.

వామపక్ష పార్టీల ధర్నా

ఏలూరు (టూటౌన్): పెంచిన విద్యుత్ చార్జీల రద్దు కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీల పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.

శ్రీవారి సేవలో మేయర్ దంపతులు



శ్రీవారికి పట్టు పవిత్రాలు సమర్పిస్తున్న నగర మేయర్ నూర్జహాన్ దంపతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి 22వ వార్షిక పవిత్రోత్సవాలు సందర్భంగా బుధవారం నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు పాల్గొన్నారు. స్వామి వారికి పట్టు పవిత్రాలు సమర్పించి విశేష పూజలు చేశారు. మేయర్ దంపతులకు అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం పలికారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావులు మేయర్ దంపతులను సత్కరించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, బత్తిన విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. దేవస్థానంలో ఉదయం శ్రీమత్ విష్వక్సేన పూజ, ప్రధాన కుంభ స్థాపన పూజలు నిర్వహించారు. సప్తవింశతి (27) కలశాలతో శ్రీవారికి అభిషేకం చేసి యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం అగ్నిప్రతిష్ఠాపన, స్వామి వారికి, అమ్మవార్లకు పవిత్రాల సమర్పణ, చేసి మంగళాశాసనాలు పలికి తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు నిర్వహించారు.

పార్థసారధి, శ్రీహరి కోటిలకు పురస్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మాతృభాషా సంస్కృతి – సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా భాష, సాహిత్య, సామాజిక, కళ, విద్య, వైద్య రంగాల్లో సేవలందిస్తోన్న వారిని గుర్తించి ఫిలాంతోరఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ అందిస్తోన్న గుర్రం జాషువా ప్రతిభా పురస్కారానికి శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు టి.పార్థసారధి, శ్రీహరి కోటి ఎంపికయినట్టు ఆ సొసైటీ వ్యవస్థాపకుడు అద్దంకి రాజా యోనా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న నగరంలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి చేతుల మీదుగా వారికి పురస్కారం ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కస్తూరిబా బాలికలు



కస్తూరిబా బాలికల పాఠశాల నుంచి ఎంపికైన బాలికలు

ఏలూరు రూరల్: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలకు 20 మంది బాలికలు ఎంపికయ్యారని కస్తూరిబా బాలికల పాఠశాల హెచ్ఎం జి.సునీత ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఏలూరులో అండర్ 14, 17 విభాగంలో హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ జిల్లా జట్లు ఎంపిక పోటీలు జరిగాయన్నారు. బాస్కెట్‌బాల్‌లో పూజిత, రుత్విక, దేవీశ్రీ, గాయత్రి, రేణుకాదేవి, సాయిభవాని, అమృత, దుర్గాభవాని, నందిని, పూజిత, తన్మయశ్రీ, మౌనిక, వామజరమణి, యోగాశ్రీ ఎంపికయ్యారని తెలిపారు. హ్యాండ్ బాల్‌లో యామనికీర్తి, యామిని, నాగరత్నం, దివ్యశ్రీ, గీతిక, వీరవిజయ ఎంపికయ్యారని వివరించారు. క్రీడాకారులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ప్రసన్నలను హెచ్ఎం సునీత అభినందించారు.

వినాయకా.. సెలవిక



నవరాత్రి మహోత్సవాల్లో పూజలు అందుకున్న గణనాథుల విగ్రహాలను జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై.. గణపతి బొప్పా మోరియా అంటూ నినదిస్తూ భక్తులు బుధవారం నిమజ్జనాలకు తరలించారు. భక్తులు స్వామివారికి వీడ్కోలు పలికారు. తూర్పులాకులు, పోస్టల్ కాలనీ, పడమర లాకులు తదిత ప్రాంతాల్లో స్వామి వార్ల విగ్రహాలను నిమజ్జనం చేశారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు



వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

ఏలూరు (టూటౌన్): రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, ఏఐఆర్‌టీడబ్ల్యూఫ్ జిల్లా కార్యదర్శి జె.గోపి కోరారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ వచ్చే నెల 6న రాజ్‌భవన్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు చెప్పారు. కేరళ, తమిళనాడు, రాష్ట్రాల్లో మాదిరిగా మన రాష్ట్రంలో కూడా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రవాణా రంగ చట్ట సవరణ ఫలితంగా రాష్ట్రంలో ఫైన్లు పెరిగిపోయాయని తెలిపారు. రవాణా రంగ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 28, 29, 30 తేదీల్లో ఏలూరు జిల్లాలో ప్రచార యాత్ర నిర్వహిస్తామన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు గొడు రవీంద్రబాబు, బత్తిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.